

# మిణుగురులు

విలువగానీ కనపడకపోగా, హేళన, వెక్కిరింతలు ఎదురయ్యాయి.

పిసమెత్తు ఉద్యోగంగానీ. . . చీమంత స్నేహితుడుగానీ . . . వలుసంత గౌరవంగానీ తనకు లభ్యంకాలేదు. మరి ఇంకా తనేం చెయ్యాలి?

ఎంత ఉతికినా నలుపు తెలుపవుతుందా?

కాకి హంసవుతుందా?

పుట్టుకతో వచ్చినవి మారాలంటే సాధ్యమా? తను లోకంతోపాటు మారినా తన కెందుకు విలువ రాలేదో భూతద్దం పెట్టి వెతికినా కారణం కనిపించలేదు.

"మిస్టర్ రామం! డిగ్రీలతోపాటు నీ వెంత స్టయిల్ నిర్వహించినా తడి పడాలి. . . తడి!" అన్నాడు రామం స్నేహితుడు జాలిపడి.

"ఖర్మ! . . ."

"అదృష్టం ఉండాలి!"

"తొందరపడితే ఎలా? ఖాళీలు ఉండద్దూ?"

"లెటజ్ ట్రై ఎగైన్."

ఇలా సంతృప్తిపడ్డాడు. వాళ్ల అమ్మమ్మ చెప్పినట్లుగా రక్ష కట్టుకున్నాడు. దేవుడికి మొక్కుకున్నాడు. కొన్నాళ్లపాటు రామకోటి కూడా రాశాడు.

ప్రయత్నం జరిగితే ఫలితం తథ్యం. అదంతా తడిలో ఉంది. అది ఒంటికి పడదు. ఛ . . . తనకేం తక్కువ? లంచం ఎందుకివ్వాలి కల్పతరువయిన 'ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజి', కామధేనువయిన 'పబ్లిక్ సర్వీస్ కమీషన్' ఉండగా? లంచాలు లేకుండా లక్ష్మీకటాక్షం కలిగించేవి అవి ఒక్కటే. 'వాటి ద్వారా త్రూ సెలక్షన్ వచ్చి పడుతుంది ఏడేడు లోకాల్లో తన ఎడ్రసు ఎక్కడున్నా' అనుకుని ఆనందపడ్డాడు.

'అయినా తనకు ఉద్యోగం చెయ్యవలసిన అగత్యం ఏమిటి? రెండు ఎకరాల పొలం, ఒకంతస్తు మేడ ఉంది. చాలదా? శుభ్రంగా దాంతో ఏదో వ్యాపార వ్యాపకం పెట్టుకుంటే తనకి కాలం గడిచిపోదా?' అనిపించింది.

'ఉద్యోగం పురుషలక్షణం! అందులో వ్యాపారం వలన తన ఆశయాలు అవినీతిలో పడతాయి. కనక ఏదైనా గవర్నమెంట్ ఉద్యోగం కనీసం పదేళ్లయినా చేసి తీరాలి. అప్పుడే తనకో విలువ! తన స్వశక్తికో కొలత!'

రెండెకరాల మాగాణీ శిస్తుకి ఇచ్చేసి, ఇల్లు మూడు భాగాలుచేసి అద్దెకిచ్చేసి తనో భాగంలో ఉంటూ వచ్చాడు చదువు పూర్తి అయిన దగ్గిరనుండీ. తల్లీ, తండ్రీ, అమ్మమ్మ రామం ఉద్యోగ వివాహాలు చూడకమునుపే దాటేశారు.

"ఉద్యోగంలో జొరబడ్డాకే పెళ్లి!" అని రామం మేనమామతో చాలా సార్లు తన నిశ్చయాన్ని వెల్లడించాడు. ఆ భీష్మ ప్రతిజ్ఞకి మేనమామ పరేవన్నాడు తనకోసం.

జనతా చెవులు గింగురుమనేలా కూసింది. రామం గతంలోంచి వర్తమానంలో పడి భవిష్యత్తుని గురించి ఆలోచనలో పడ్డాడు దాంతో . . .

'కౌసల్య . . . ఎంత మంచి పేరు. . . తనను చేసుకుంటుందా? అశక్తుడు. . . . జడుడు . . . నిరుద్యోగి అయిన తన్ను ప్రేమిస్తుందా? ఛీ! . . . కౌసల్య వయసు తనకంటే . . .! టైప్, షార్ట్ హేండూ పాసయింది. ఏదో ఉద్యోగం కూడా చేస్తోంది. ఇప్పు డెలా ఉందో? తను ఇలా సర్టిఫికెట్స్ చేతపట్టుకుని ఉద్యోగంకోసం తిరుగుతున్నట్టు తెలిస్తే ఏమనుకుంటుందో? . . . ఎప్పుడో అమ్మ పోయి నప్పుడు మావయ్యతో వచ్చింది. . . ఇప్పుడు హైదరాబాద్‌లో ఉంది.'

ట్రెయిన్‌లో దీపాలు ఆరిపోయి మళ్లీ తక్కున వెలిగాయి. ఆ వెలుతురులో జిగేల్‌మని మెరిసింది బెజవాడలో ఎక్కిన ఆ స్త్రీ. అప్పుడు చూశాడు ఆమెని నిదానంగా.

తుళ్లిపడ్డాడు రామం.

ఎవరో కాదు. . . కౌసల్య! మళ్లీ చూశాడు. ఎంతో మార్పు. పలకరిద్దా మనుకున్నాడు. మాట రాక నోరు తడి ఆరిపోయింది. ఆమె మెడకేసి చూసి తుళ్లిపడ్డాడు.

మంగళసూత్రం! . . . రామం గుండెలు దడదడలాడాయి. 'ఎవరు కట్టారది? ఎప్పుడు కట్టారు? ఎక్కడ కట్టారు? అందులోనూ తనకు తెలియకుండానా? ఈమె కౌసల్యేనా? ఔనా? కాదా? కలా? నిజమా? పలకరిద్దామా? వద్దా? కాకపోతే? . . . ఏమైనా ఇదేదో తేల్చుకోవాలి. ఆమె కౌసల్య అయితే తన నెందుకు పలకరించదు? సిగ్గా? గుర్తు పట్టలేదా?' రామం సీట్లో సరిగ్గా కూర్చోలేక పోతున్నాడు.

"కౌ . . . !" అనబోయాడు. అంతలో మొహమాటం. ట్రెయిన్ సద్దుమణిగి అంతా నిద్రాముద్రితులయ్యారు.

ఆమె బద్ధకంగా ఆవలించి, రామంకేసి చూసి "టైమెంతయిందండీ" అని అడిగింది. రామానికి పొరబోయింది. మాట తడబడి ఎలాగో ఆ వీణారావానికి "పదిన్నర . . ." అన్నాడు. శ్రుతి తప్పిన వీణలా ఆ జవాబు వచ్చింది రామం నోటినుండి.

"మీ రెంతవరకు వెళుతున్నారు?"

ఆమె నలాగే చూస్తూ నిశ్చేష్టుడయాడు. చివరికి ధైర్యం తెచ్చుకుని "మీరేమీ అనుకోనంటే నే నొకటి అడుగుతాను" అన్నాడు గుండెల వేగాన్ని అదుపులో పెట్టుకుంటూ.

"ఏమిటది — అంత ముఖ్య విషయం?" అంది రామాన్ని పురుగులా చూస్తూ.

"మీ పేరు . . ."

"భలేవారే. . . నా పేరుతో మీకేమి టవసరం?"

"మిమ్మల్ని ఎక్కడో చూశాను."

"నన్నా! . . . పొరపాటేమో? . . . నన్ను పోలిన వారిని చూసి ఉంటారు. . ."

"ఏమో . . . ఆ పేరూ, మీ రూపూ ఒకటో కాదో ననే నా ఆరాటం."

"అది సహజమే. ఆమె మీ కేమౌతారు?"

"మా మా మయ్య కూతురు . . ."

"నేనే మీ మావయ్య కూతుర్ని అయితే మిమ్మల్నెందుకు పలకరించను? మనిషి నాలాగే ఉంటుం దనుకుంటాను."

"అచ్చు మీలాగే . . . మీ పేరు?"

"నేను మీ మేనగోడల్ని కానప్పుడు నా పేరు మటుకు ఎందుకులెండి."

"అయితే మీ పేరు నేను వినగూడదా?"

"వినచ్చు. . ." బండి అదేదో స్టేషన్‌లో ఆగడంతో ఆమె మాట ఆపోయింది.

# నలుపు - తెలుపు

## పి. ఎస్. గోపాల్

నలుపు తెలుపుల మధ్య
సామ్యం లేదన్న దెవరు?
తెల్లతామర హృదిలో
నల్లని భ్రమరం హాయిగా
మకరందం గ్రోలటంలేదూ?
తెల్లని వెన్నెల కురిసే
సుధాకరుని పర్యంకంలో
నల్లని శశశాబకం
చల్లగా పవ్వళించటంలేదూ?
చల్లని వేణుగానముతో
మైమరపించే
నల్లనయ్య ఒడిలో రాధ
ఒదిగిపోవడం లేదూ?
నల్లని కారుమేఘాల
పరిష్వంగంలో తటిల్లత
ఉల్లము పెల్లుబుకు కాంతి
పుంజములను
వెదజల్లటం లేదూ?
నల్లని హిమాలయోత్తుంగ
శృంగాలపై
తెల్లని మంచుపొరలు చల్లని
పిల్లతెమ్మెరలను రువ్వటంలేదూ?
అందుకే నే నంటున్నదీ
అంతకు ముందే
బుద్ధులలో నొక్క చెప్పినదీ
ఇదీ:
నలుపులోని తెలుపును
కాంచుటయే మంచి
కలుపుగోలుతనంలోనే వుంది
సుఖం స్వర్గాన్ని మించి!

[అసామియా మహాకవి లక్ష్మీకాంత్ బెజ్‌బారువాకు కృతజ్ఞతతో]

# గాంధీజీ సూక్తులు



## మతాల మార్గాలు

"ఒకే గమ్యస్థానంవైపు సాగే రకరకాల బాటలవంటివే మతాలు. మనం అదే గమ్యస్థానం చేరుకోగలిగినప్పుడు ఏ బాట అనుసరిస్తేనేం? నిజానికి వ్యక్తులెందరున్నారో అన్ని అసంఖ్యాక మతాలు ఉన్నాయి. వివిధ మతాలు వర్ధిల్లుతున్నంత కాలం ప్రతి మతానికీ ఒక విభిన్న ప్రత్యేక చిహ్నం అవసరం. అయితే ఆ చిహ్నాన్ని మరొక మతంకంటే తమ మతం గొప్పదని ఆధిక్యం కలదని రుజువు పరుచుకోడానికి ఉపయోగించుకునే ఆయుధంగా మారినట్లయితే మాత్రం దానిని పరిత్యజించాలి."

✱ ఇది గాంధీజీ శతజయంతి సంవత్సరం ✱

"ప్లీజ్ . . . మీరేమీ అనుకోనంటే నేనొకటి అడుగుతాను."

"ఏమిటి — అంత ముఖ్య విషయం?"

ఇద్దరూ నవ్వుకున్నారు పరిచిత పర్వణ సంభాషణకు.

"ఫ్లాస్క్‌లో ఒక కప్పు కాఫీ . . . అంతే! . . . థేంక్స్ . . ." అంటూ ఆమె ఫ్లాస్క్ తీసి ఇచ్చింది. రామం ట్రెయిన్ దిగి కాంటీన్ వైపు నడిచాడు. అంతే! బండి కదిలిపోయింది. రామం గబగబా కాఫీ పోసుకుని మరో పెట్లో ఆదరాబాదరా ఎక్కేశాడు. ఆ గాభరాలో తన జేబులోకి ఓ చెయ్యి వెళ్ళి, గర్వంగా బయటకు రావటం అతను గమనించలేదు.

అతని గమనికల్లా ఆ యువతికి కాఫీ అందించలేక పోయాననే తపన మాత్రమే.

'కాఫీ తీసుకు రాలేకపోయాడు? ఫ్లాస్క్ ఎత్తుకు పోయాడు ... ' అని ఆమె తనను గురించి ఏమి అపోహ పడుతూందో. ఆమె ఎక్కడ దిగిపోతుందో అడగలేదు, ఇప్పు డెలా?'

మరో గంటకి ట్రెయిన్ ఆగింది. ఆమెను కలుసుకున్నాడు. తనచోటు ఎవరో దురాక్రమణ గావించారు. తను వాళ్ళని లెమ్మని అడగలేదు. ట్రెయిన్ కదిలేలోగా కాఫీ తేలేడు . . . ఛీ! . . . తనెంత జడుడు . . . ఆమె ఫ్లాస్క్ అందుకుంటూ అదోలా నవ్వింది. అది హేళన, వెక్కిరింపు అనిపించింది రామానికి.

'అందరూ తనని పురుగులా చూస్తున్నారు. అన్నీ ఉండి అల్లాడి నోట్లో శనిలావుంది తన శక్తి. తనది స్వయంప్రకాశం. తను పురుగు కాదు. భగవంతుడి దృష్టిలో అంతా పురుగులే. తనకీ ప్రకాశం ఉంది. తను మెరిసే పురుగే. కానీ తన ప్రకాశం చీకట్లో పడి ఎప్పుడో తళుక్కుమంటూంది. అది లోకానికి అంటటం లేదు.'

సిగరెట్ కాల్చాలనిపించింది. కంపార్ట్‌మెంట్ క్రిక్కిరిసిపోయింది. చాలా మంది పొగ వదులుతున్నారు. తనూ తాగితే? ఎవరిమీదయినా చురక పడితే? 'ఈ ఇరుకులో తాగితే తరవాత ఏదైనా జరిగితే తన్నులు తినాలి' అనుకుని మానుకున్నాడు. సిగరెట్ పేకట్ జేబులో వేసుకున్నాడు. ఇదంతా ఆమె చూస్తున్నది. కాళ్ళు పీకుతున్నా రామం అలాగే నిలుచుని కిటికీలోంచి చీకట్లోకి చూశాడు. అనంతమైన నల్లని చీకట్లో అప్పుడప్పుడు 'మాకూ వ్యక్తిత్వం ఉంది' అని వెలుగుతున్న మిణుగురులు కనిపించాయి. తన బ్రతుక్కి ఆమాత్రమయినా విలువ ఉందా?

కౌసల్యకు వివాహం జరగకుండా ఉంటే . . .

తనకు ఉద్యోగం దొరికితే . . .

తన నీతి తన సలా అంటిపెట్టుకుని ఉంటే . . .

ఆత్మబలంతో ధైర్యంగా ఉంటే . . .

తను పురుగులా కనిపించడు. ఇది జరిగే పనేనా?

అదే జరిగితే ఒయాసిస్సులు జలాశయాలతో నిండిపోయి, అందులో కొమ్ములున్న కుందేళ్ళు పట్టపగలు చుక్కల కాంతిలో జలకా లాడుతాయి.

ఇది సాధించాలంటే ఏడు చెరువుల నీళ్ళు తాగాలి. ఇష్టమయిన దానికోసం కష్టమయినా ఓపికపట్టడం కార్యసాధకుల లక్షణమని ఆర్యోక్తి. కనక నిలబడాలి.

నిలబడి నిలబడి రామం కాళ్ళు పీక్కుపోయాయి. చెమటలు పోశాయి. ఎక్స్‌ప్రెస్ తెనాలి జంక్షన్‌లో ఆగింది. రామం అక్కడ దిగిపోయాడు. కాంటీన్‌లో కాఫీ తాగి డబ్బులిద్దామని చూస్తే పర్స్ లేదు. మరో జేబు చూసుకున్నాడు. సర్టిఫికెట్స్ చెక్కు చెదరకుండా ఉన్నాయి. మరి పర్స్? 'ట్రెయిన్‌లో పడిపోయిందేమో? . . .' తను స్టయిల్ నేర్చిన రోజుల్లో అలవర్చుకున్న ఫాషన్ గుర్తు వచ్చి, మడిచిన చొక్కాలోంచి రెండు రూపాయలు తీసి కాఫీ డబ్బులు ఇచ్చేశాడు. ఆ స్టయిల్ తన కీ విధంగా ఉపయోగించింది. బెల్ మ్రోగింది. ఎక్స్‌ప్రెస్ కదిలింది. గబగబా రామం తను ఎక్కిన కంపార్ట్‌మెంట్ దగ్గిరికి పరిగెత్తాడు.

"థేంక్స్ . . . వస్తానండీ . . . నా పేరు వినాలని ఉంది అన్నారు కదూ? . . ." అని ఆ యువతి కిటికీలోంచి తల బయటకు పెట్టి రామాన్ని పలకరించింది. ఆత్రంగా రామం ఆమెని చూశాడు ఏమి చెబుతుందోనని . . .

"మీ మేనగోడలులా ఉన్నాను గదూ? పేరుకూడా అదే! కౌసల్య. . ." ట్రెయిన్ ఖంగుమని కూసింది.

రామం తుళ్ళిపడ్డాడు. పిడుగు పడ్డట్టు బాధపడ్డాడు. 'తను కౌసల్య పేరు ఈమెతో చెప్పలేదు. ఆ పేరు ఈమెకెలా తెలిసింది? ఈమె కౌసల్యేనా?...'

తిరిగి చూడబోయేసరికి ఎక్స్‌ప్రెస్ ఔటర్ సిగ్నల్ దాటిపోయి, ఖాళీ పట్టాలు కనిపించాయి తనముందు.

దూరంగా మెల్లిగా కూత వినిపించింది.

ఇదేదో విచిత్రంగా ఉంది. హైదరాబాద్ వెళితేగాని నిజం బయట పడదు. ఈమె నిజంగా కౌసల్య అయితే ఆ మంగళసూత్రం? . . .

రామం మస్తిష్కం వేడెక్కింది. పర్స్ పోవడంతో మరీ వేడెక్కింది. 'వేడివేడి టీ తాగితేగాని ఆ వేడిలోని రహస్యాన్ని గురించి ఆలోచించే శక్తి రాదు' అనుకుంటూ మళ్ళీ కాంటీన్ వైపు నడిచాడు.

టైమ్ చూసుకున్నాడు. రాత్రి రెండయింది. డేట్ మారింది. టికెట్ చూసుకున్నాడు. 'టిక్కట్టు పర్సులో పెట్టకపోవడం మంచిదయింది' అనుకుంటూ టీ గటగట తాగేసి మెయిన్ గేట్ కేసి నడిచాడు. అక్కడ టికెట్ ఇచ్చేసి, రేపల్లెకు టికెట్ తీసుకున్నాడు. తన అదృష్టం. టికెట్ పోను ఇంకా డబ్బులు మిగిలాయి. మళ్ళీ రెండవ నెంబర్ ప్లాట్‌ఫారమ్ మీదకు వచ్చాడు. నిద్ర ముంచుకు వస్తూంది. బెంచిమీద అలా వాలిపోయాడు.

'స్టార్ట్ ఇమీడియట్లీ విత్ సర్టిఫికెట్స్' అని రామానికి టెలిగ్రాం రావడంతో రేపల్లెకు బయలుదేరాడు. ఆ టెలిగ్రాం ఇచ్చినది రామం తండ్రి స్నేహితుడు. 'తన కేదో ఉద్యోగానికి ఇంటర్వ్యూ వచ్చి ఉంటుంది. అందుకే ఆయన టెలిగ్రాం ఇచ్చారు' అనుకుని రామం బయలుదేరాడు.

తెల్లగా తెల్లవారుతుండగా రేపల్లె బండి కదిలింది. రామం బండి కదిలాక చూసుకున్నాడు, తన జేబులో సర్టిఫికెట్స్ లేవని. పిచ్చెత్తినట్లయింది అతనికి. ఎవరో కొట్టేశారు.

ఈమధ్య సర్టిఫికెట్ల దొంగలు బాగా చెలరేగారు.

* * *

మరో పది రోజుల తరవాత పత్రికలో 'సంగ్రహ ప్రకటనలు' శీర్షికలో 'పోయినది', 'కనిపించుటలేదు' అని రెండు 'హెడ్‌లైన్స్' ప్రకటనలు ముద్రించబడ్డాయి.

ఒకటి రామం ఇచ్చినది:
మరొకటి రామం మేనమామ ఇచ్చినది:
ఒకటి సర్టిఫికెట్! వేరొకటి కౌసల్య!

రామం యిచ్చిన గుర్తులలో "సర్టిఫికెట్ రిజిస్టర్ నెంబరు 1214168." రామం మేనమామ ఇచ్చిన గుర్తులలో "కౌసల్య మంగళసూత్రం ఆకారంగల నెక్లెస్ ధరించియుండును. అప్పగించినవారికి తగిన పారితోషికం!"

ఇదీ ఆ ప్రకటనలలోని సారాంశం! ★